క్లుప్తంగా

సంక్రాంతి శుభాకాంక్షలు


ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె : ప్రజలకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు శనివారం తెలిపారు. సంక్రాంతి పండుగను నియోజకవర్గంలోని ప్రజలు తమ కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులతో సంతోషంగా జరుపుకోవాలని కోరారు. ఈ ఏడాది కూడా సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో రైతులు, ప్రజలు సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

భక్తి శ్రద్ధలతో ఎదుర్కోళోత్సవం


పల్లకీ సేవా నిర్వహిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : పట్టణంలో వెలసిన శ్రీగోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తి శ్రద్ధలతో ఎదురుకోళ్లోత్సవం, పల్లకీ సేవా నిర్వహించారు. ధనుర్మాసం పూజా కార్యక్రమంలో భాగంగా ప్రధాన అర్చకుడు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవా నిర్వహించారు. అనంతరం ఒక వైపు మహిళలు, మరో వైపు పురుషులు ఆహ్లాదకర వాతావరణంలో ఎదురుకోళోత్సవం సాగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, రజనీ కుమారి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గోదాకృష్ణ కల్యాణోత్సవం : స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాసం పూజల్లో భాగంగా సంక్రాంతి బోగి పండుగను పురస్కరించుకుని ప్రసన్న మండపంలో గోదాకృష్ణుల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు అర్చకులు శ్రీకాంత్‌శర్మ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కల్యాణోత్సవ పూజలు ప్రారంభం అవుతాయని, భక్తులు పాల్గొని స్వామి ఆశీస్సులు పొందాలని కోరారు.

క్వింటా కందికి మద్దతు ధర రూ.9,385

ప్యాపిలి: క్వింటా కందిని మార్క్‌ఫెడ్ రూ. 9,385 మద్దతు ధరతో కొనుగోలు చేయనున్నట్లు ఏఓ రాజేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం, సోమవారం రైతులు తమ సమీపంలోని ఆర్బీకేల్లో కంది విక్రయాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆదివారం, సోమవారం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే ఈ ధర వర్తిస్తుందని తెలిపారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులు పూర్తి

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలో సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తయ్యాయి. స్టేట్ బ్యాంక్ నుంచి తేరు మిద్దె సమీపం వరకు ప్రధాన రహదారి దారుణంగా ఉండేది. వర్షాకాలంలో మోకాలిలోతు నీళ్లు రోడ్డుపై ప్రవహించేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చొరవ తీసుకున్నారు. కోటి రూపాయలతో విశాలమైన సీసీ రోడ్డు నిర్మించారు. రామ్‌కో సిమెంట్ కంపెనీ సహకారంతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయించారు. రోడ్డు డివైడర్ పనులు జరుగుతున్నాయి. లైటింగ్ పనులు పూర్తి కావడంతో ట్రైల్ రన్ చేశారు. త్వరలోనే ప్రధాన సిమెంట్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పేదలకు సరుకులు పంపిణీ


సరుకులు అందజేస్తున్న స్ఫూర్తి సభ్యులు

డోన్ టౌన్ : పట్టణంలోని నిరుపేద కుటుంబాలకు శనివారం దాతల ఆర్థిక సాయంతో స్ఫూర్తి సేవా సమితి సంక్రాంతి పండుగకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని తమ వంతుగా పేదలకు సాయం చేశామని సంస్థ వ్యవస్థాపకుడు సీసంగుంతల మధు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు రాము, చంద్ర, వసంత్, మోహన్‌రెడ్డి, వాసు, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : మండలంలోని మల్యాల సబ్ స్టేషన్‌లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు అత్యవసర పనుల నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని యాపదిన్నె, చనుగొండ్ల, తాడూరు, బి.రామదుర్గం, కటారుకొండ గ్రామాల ఫీడర్లకు మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయానికి తెల్లవారుజాము 5 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, రాత్రి 9గంటల తరువాత విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

ప్రైవేట్ ఆసుపత్రిపై ఫిర్యాదు

డోన్ టౌన్ : పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిపై శనివారం జిల్లా ఉన్నతాధికారులకు న్యాయవాది ఫిర్యాదు చేశాడు. బాధితుల వివరాల మేరకు పట్టణానికి చెందిన మాధవి, విజయ మహిళలు కడుపు నొప్పితో ఆ ప్రైవేట్ వైద్యశాలకు వెళ్లి ఎంబీబీఎస్ డాక్టర్‌కు సంబంధించి ఓపీ తీసుకున్నారు. అయితే ఆ డాక్టరు చూడకుండా అనర్హత డాక్టర్ పరీక్షలు నిర్వహించడంతో ఇదేమిటని ప్రశ్నించారు. దీంతో డాక్టర్, రోగుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సంఘటనపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిరాదు చేసినట్లు బాధితుల బంధువు న్యాయవాది ఈశ్వర్ తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాల వర్తింపు
- పాలనలో దేశంలోనే మొదటి స్థానం
- అసైన్డ్ భూముల లబ్ధిదారులకు శాశ్వత హక్కు పత్రాలు అందజేసిన మంత్రి బుగ్గన



అసైన్డ్ భూముల లబ్ధిదారులకు శాశ్వత భూ హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న మంత్రి బుగ్గన, కార్యక్రమానికి తరలివచ్చిన ప్రజలు

బేతంచెర్ల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా పేదలందరికీ ప్రభుత్వ ఫలాలు అందజేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోడ్పాటునందిస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ సీఎం జగనన్న పాలన సాగిస్తుండడంతో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నామని పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామంలో రూ. 80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను డీఎంహెచ్ఓ వెంకటరమణ, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డితో కలిసి మంత్రి శనివారం ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆవరణలో తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీడీఓ వెంగన్న, నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బుగ్గానిపల్లెకు చెందిన 110 మంది రైతులకు సంబంధించి 128.54 ఎకరాల అసైన్డ్ భూములకు సంపూర్ణ హక్కు పత్రాలను మంత్రి బుగ్గన అందజేశారు. అదేవిధంగా 117 మందికి ఇంటి పట్టాలను మంత్రి పంపిణీ చేశారు. అంతకుముందు గ్రామంలోని పురాతన బ్రహ్మ సూత్ర సహిత మరకత నాగలింగేశ్వరస్వామిని మంత్రి బుగ్గన దర్శించుకున్నారు. మంత్రి చొరవతో ఆలయ అభివృద్ధికి రూ.40 నిధులు మంజూరయ్యాయి. దీంతో అభివృద్ధి పనులు ప్రారంభించాలని ఈ సందర్భంగా మంత్రి అధికారులను ఆదేశించారు. తదనంతరం ఆలయ నిర్వాహకులు చిన్న శేషపణి, చిన్ని ఎల్లరామయ్య, కేశాలు, జయరాముడు, నాగ వెంకటేశ్వర్లు మంత్రి బుగ్గనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ ముర్తుజావలి, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజా, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ, నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్ మధు,సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ, మాజీ సర్పంచ్ మాదవ లక్ష్మమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు బాబుల్‌రెడ్డి, గూని నాగరాజు, మధు, రంగస్వామి, మద్దయ్య, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డోన్ నియోజవకర్గ అభివృద్ధే లక్ష్యంగా...

డోన్ నియోజవకర్గం అభివృద్ధే లక్ష్యంగా అంకిత భావంతో కృషి చేస్తున్నానని మంత్రి బుగ్గన తెలిపారు. నియోజకర్గంలోని మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లోనూ అభివృద్ధి పనులు చేశామన్నారు. కనుమకింది కొట్టాల వద్ద రూ. 2,50 కోట్లతో బిల్ల స్వర్గం గుహలనుపర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. మద్దిలేటిస్వామి ఆలయాన్ని రూ.50 కోట్లతో అభివృద్ధికి చర్యలు చేపట్టామని గుర్తు చేశారు. మూతపడిన పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీని ప్రారంభించి కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. పూర్తి స్థాయిలో ఉత్పత్తి కొనసాగితే రానున్న రోజుల్లో మరికొంత మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. రూ.350 కోట్లతో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి వాటర్ గ్రిడ్ పథకం కింద పనులు పూర్తి చేసి బుగ్గానిపల్లె తండా 8 ఎకరాల్లో నిర్మించిన నీటి ట్యాంకుల ద్వారా బేతంచెర్ల మండలానికి ఈనెలలో ఇంటింటికీ శుద్ధమైన నీరు అందజేస్తామన్నారు. విద్యకు సంబంధించి గోరుమాను కొండ గ్రామ సమీపాన రూ.36 కోట్లతో బీసీ బాలుర రెసిడెన్సియల్, రూ.8 కోట్లతో ఐటీఐ కళాశాల, రూ.4 కోట్లతో ఎంఎస్ఎమ్ టూల్ డిజైనింగ్ ఇనిస్టిట్యూట్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. సాంకేతిక విద్యను అందుబాటులోకి తేవడానికి పాలిటెక్నిక్ కళాశాల మంజూరుతో పాటు నిర్మాణానికి రూ.33 కోట్లు నిధులు మంజూరయ్యాని, పనులు ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. మండల కేంద్రమైన బేతంచెర్ల నుంచి నాలుగు వైపులా రహదారులను అభివృద్ధి చేశామని, దీంతో భూముల ధరలు కూడా పెరిగాయన్నారు. ప్రజలకు మేలు చేయాలన్న తలంపుతోనే రాజకీయాల్లోకి వచ్చామని, స్వప్రయోజనాల కోసం కాదన్నారు.

టీడీపీ మోసపూరిత వాగ్దానాలను నమ్మొద్దు

ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ నాయకులు కుట్రరాజకీయాలకు పాల్పడుతున్నారని, వారి జిమ్మిక్కులు, మోసపూరిత వాగ్దానాలను నమ్మొద్దని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రజలను కోరారు. టీడీపీ అధ్యక్షుడు చంద్ర బాబు నాయుడు మొదలుకుని నియోజకవర్గా ఇన్‌చార్జ్‌లు సైతం కుట్రలు, కుతంత్రాలకు తెరలేపారని, అసత్యారోపణలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇక డోన్ టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి తీరు మరీ అధ్వానంగా ఉందని, ప్రజలను మభ్యపెట్టేందుకు నమ్మలేని వాగ్దానాలు చేస్తున్నారన్నారు. డోన్ నియోజవర్గ వ్యాప్తంగా ఉన్న రేషన్ కార్డు దారులందరికీ సెంటున్నర ఇంటి స్థలం ఇస్తామంటూ సుబ్బారెడ్డి చెప్పడం హాస్యాస్పదమన్నారు. 32 వేల కుటుంబాలకు ప్లాట్లు ఇవ్వాలంటే 785 ఎకరాలు అవసరమని, మరి సుబ్బారెడ్డి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. బాబు ఇస్తారా... లేక సుబ్బారెడ్డే వ్యక్తిగతంగా ఇస్తారా అనే విషయంపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒక్క బేతంచెర్ల పట్టణంలోని ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటే 300 ఎకరాలకు సగటున రూ. 300 కోట్లు అవసరమని, మరి సుబ్బారెడ్డి ఇస్తారా అని నిలదీసిన మంత్రి బుగ్గన ఇలాంటి హామీలు ప్రజలను మభ్యపెట్టేందుకుకాక మరేమిటని ఎద్దేవా చేశారు.

ఎస్ఐల బదిలీ

కోవెలకుంట్ల: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసు అధికారుల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. కోవెలకుంట్ల సర్కిల్ పరిధిలోని ముగ్గురు ఎస్ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కోవెలకుంట్ల, సంజామల, రేవనూరు ఎస్ఐలు వెంకటరెడ్డి, ప్రతాప్, కల్పనను కర్నూలు రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు. రేవనూరు ఎస్ఐగా నంద్యాల తాలుకా స్టేషన్‌లో పనిచేస్తున్న రాంమోహన్‌రెడ్డిని నియమిస్తూ జిల్లా పోలీసు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఎస్ఐలు రిలీవ్ కావాల్సి ఉంది. మిగిలిన రెండు స్థానాల్లో ఎస్ఐలను నియమించాల్సి ఉందని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి.

15న చెన్నకేశవస్వామి ఊరేగింపు

బేతంచెర్ల : మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామస్తుల ఆరాధ్యదైవం చెన్న కేశవస్వామి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం అవుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈనెల 15న మధ్యాహ్నం నుంచి చెన్నకేశవ స్వామి ఉత్సవమూర్తిని గ్రామ పురవీధుల గుండా ఊరేగిస్తామన్నారు.

17న ఆసుపత్రి భవన ప్రారంభోత్సవం

కోవెలకుంట్ల: పట్టణంలో రూ. 3.80 కోట్లతో నిర్మించిన 30 పడకల ఆసుపత్రి భవనాన్ని ఈనెల 17వ తేదీన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాడు- నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అన్ని హంగులతో కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు కొత్త భవనాన్ని నిర్మించిందన్నారు. జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రెడ్డిపల్లెలో టీడీపీకి షాక్

- ఎమ్మెల్యే కాటసాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ఆరు కుటుంబాలు


ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన రెడ్డిపల్లె నాయకులు

సంజామల: మండల పరిధిలోని రెడ్డిపల్లె గ్రామంలో టీడీపీకి షాక్ తగిలింది. శనివారం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో గ్రామానికి చెందిన 6 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఉప్పు నారాయణ రెడ్డి,చిన్నపు రెడ్డి శివరామి రెడ్డి, చిన్నపురెడ్డి సతీష్ రెడ్డి,మురళీశ్వర్ రెడ్డి,కె. వెంకట్రామిరెడ్డి, గుర్రప్ప తదితరులకు ఎమ్మెల్యే కాటసాని వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి సాదారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్న తీరుకు ఆకర్షితులై టీడీపీని వీడీ వైఎస్సార్‌సీపీలోకి వచ్చారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి,నాయకులు నరసింహారెడ్డి, పోచా వెంకట్రామిరెడ్డి,ఎస్సీ బాబు,సాయి, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- భూమిలేని పేదలకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- మహిళలకు భూ పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి


మహిళకు పట్టాను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

సంజామల: పేదల అభ్యున్నతే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. భూమిలేని పేదలకు సీఎం జగనన్న అండగా నిలుస్తున్నారని, మహిళలకు భూ పంపిణీ చేసి రైతులుగా మార్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. మండల పరిధిలోని రామిరెడ్డిపల్లె గ్రామంలో శనివారం మహిళలకు ఇళ్ల పట్టాలు, భూ పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, వెస్ ఎంపీపీ చిన్న బాబు, రామిరెడ్డిపల్లె సర్పంచ్ మంచాల సోమ సుందర్ రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, ఎంపీడీఓ నాగకుమార్ తదితరులతో కలసి మహిళలకు ఎమ్మెల్యే ఇళ్ల పట్టాలు, భూ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లడారు. జగనన్న ప్రభుత్వం మహిళలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వాలు మహిళలకు ఏన్నడు చేయని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తు మహిళ ఆర్థికాభివృద్ధికి జగనన్న తోడుగా నిలుస్తున్నారని గుర్తు చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్, ఇళ్ల స్థలం పొందాలంటే జన్మ భూమి కమిటీల చుట్టూ తిరుగాల్సిన దుస్థితి ఉండేదని, అయినా పేదలకు న్యాయం జరిగేది కాదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీలకు స్వస్తి పలికి సచివాయ, వలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చి ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని వివరించారు. అర్హత ఉంటే చాలు ఎవరి సిఫారసు అవసరం లేకుండానే సంక్షేమ పథకాలు మీ ముంగిటకు వస్తున్నాయన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు.

బీసీ జనార్దన్‌రెడ్డి... రామిరెడ్డిపల్లెకు చేసిందేమీ లేదు!

టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి రామిరెడ్డి పల్లె తన సొంతూరుతో సమానమని చెప్పుకోవడం తప్పా చేసిందేమీ లేదని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఎద్దేవా చేశారు. అయితే ఎమ్మెల్యేగా తాను గ్రామాభివృద్ధికి అంకితభాంతో కృషి చేశామని కాటసాని చెప్పారు. గ్రామంలో దాదాపు 226 మందికి ఇంటి స్థలాలు ఇచ్చామని, 72 మంది మహిళలకు భూ పట్టాలను అందించామని గుర్తు చేశారు. అదేవిధంగా గ్రామంలో రూ. 5 లక్షలతో ఉచిత మినరల్ ప్లాంట్ ఏర్పాటు చేశామని, ముస్లిం సోదరులకు శ్మశానవాటిక కోసం రెండు ఏకరాలు కేటాయించామన్నారు. అదేవిధంగా హిందు శ్మశానవాటిక కోసం మూడు ఏకరాలు, రజక సోదరుల సౌకర్యార్థం ధోబీ ఘాట్‌కు 80 సెంట్లు కేటాయించామని వివరించారు. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో మరోమారు దొంగ హామీలతో టీడీపీ నాయకులు మీ ముందుకు వస్తారని, వారి మాటలు నమ్మొద్దన్నారు. ఏ ప్రభుత్వంలో న్యాయం జరిగిందో... ఆ ప్రభుత్వానికి అండగా నిలువాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కాంట్రాక్టర్ ప్రసాద్ రెడ్డి,లక్ష్మి రాముడు,ఓబులేసు,లక్ష్మి నారాయణ,రమణ రెడ్డి,పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


గురువులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

ప్యాపిలి: మండల పరిధిలోని హుసేనాపురం ఉన్నత పాఠశాలలో శనివారం 2011-12 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ప్రస్తుత హెచ్ఎం అంజనప్ప అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో దాదాపు 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. అలనాటి రోజులను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం అప్పటి హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు రాంప్రసాద్, సుబ్బరాయుడు, శివయ్య, లక్ష్మన్న, వెంకటేశ్వర్లు, నాగజ్యోతి, వేణుగోపాల్, సర్వజ్ఞమూర్తి, గోపాల్, దివాకర్ తదితరులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సుధాకర్, హరి, రామాంజనేయులు, అరవిందు, చరణ్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ కోర్సులకు ఉచిత డెమో క్లాసులు

డోన్ టౌన్ : పట్టణంలోని శ్రీ సాయి గ్లోబల్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ అకాడమీలో ఈ నెల 30వ తేదీన ఇన్ఫోటెక్ సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ కోర్సులకు సంబంధించి ఉచిత డెమో క్లాసులు నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకుడు ఇమిడి లక్ష్మణ్ సాయినాథ్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్, బెంగుళూరు స్థాయిలో ఇచ్చే శిక్షణ డోన్‌లో ఇస్తున్నట్లు తెలిపారు. పైథాన్, జావా, జావాస్క్రిప్ట్, డేటా సైన్స్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ తదితర కోర్సులకు ఆఫ్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. దూర ప్రాంతాలకు వెళ్లకుండా పట్టణంలోనే అనుభవజ్ఞులతో శిక్షణ ఇప్పిస్తున్నామని, ప్లేస్‌మెంట్ ట్రైనింగ్ ఏర్పాట్లు చేసామన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవానలి సూచించారు. పూర్తి వివరాలకు గ్లోబల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



రెడ్డిపల్లె గ్రామంలో శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

సంజామల: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టణాలతో సమానంగా పల్లెల్లోనూ మౌలిక వసతులు కల్పిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. మండలంలోని ఆల్వకొండ సచివాలయ పరిధిలోని రెడ్డిపల్లెలో దాదాపు రూ.10 లక్షలతో సీసీ రోడ్డును, పేరుసోముల సచివాలయ పరిధిలోని రామిరెడ్డిపల్లె గ్రామంలో డీఎంఫ్ నిధులతో దాదాపు రూ.1 కోటితో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును శనివారం ఎంపీడీఓ నాగకుమార్, మండల వైఎస్ ఎంపీపీ చిన్న బాబు, సర్పంచ్ సోమసుందర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహారెడ్డి, నారాయణ రెడ్డి, అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే కాటసాని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేయడంతోపాటు గ్రామాల అభివృద్ధికి పాటు పడుతుందన్నారు. ఏ గ్రామాలు చూసిన అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని, ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వన్ని మరోమారు ఆశీర్వాదించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ముక్కమల్ల మాజీ సర్పంచ్ పోచా వెంకట్రామిరెడ్డి, నాయకులు ఎస్సీ బాబు, కో ఆప్షన్ మెంబర్ సాయి,ప్రసాద్ రెడ్డి, లక్ష్మిరాముడు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి




భోగి మంటలు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని, కుటుంబ సభ్యులు, విజేతలకు బహుమతులు అందజేసిన కాటసాని జయమ్మ, మేథాశ్రీరెడ్డి

బనగానపల్లె రూరల్ : తెలుగు రాష్ట్రాల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండగ అని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే కాటసాని పెద్ద కుమారుడు దివంగత కాటసాని నాగార్జునరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలను సతీమణి కాటసాని జయమ్మ, కోడలు మేథాశ్రీరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. సంక్రాంతి ముగ్గుల పోటీలను అందంగా ఏర్పాటు చేసిన నిర్వాహకులు డాక్టర్ రవికుమార్,డాక్టర్ వాసవిదేవి స్వర్ణలత, సుప్రజలకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుటుంబ సభ్యులు బోగి మంటలను వెలిగించారు. మహిళలతో కలిసి జయమ్మ, మేథాశ్రీరెడ్డి సరదాగా నృత్యం చేసి ఉత్సాహపరిచారు. చిన్నారులు ప్రదర్శించిన డాన్స్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గాథంశెట్టి వేనుగోపాల్, యాగంటి ఆలయ చైర్మన్ తోటబుచ్చిరెడ్డి, ఎంపీపీ మానసవీణ, మార్కెట్‌యార్డు చైర్మన్ దీవెనమ్మ, పట్టణ సర్పంచ్ ఈసారియల్లమ్మ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, అంబటిరవికుమార్‌రెడ్డి ఆర్యవైశ్యసంఘం నాయకులు జక్కానాగరాజు, శ్రీరామవెంకట సుబ్రహ్మణ్యం, చక్రపాణి, నాగేంద్ర, గోపాలయ్య, రామసుబ్బారెడ్డి, జమ్మిసుబ్బారెడ్డి, కాటసాని రామకృష్ణారెడ్డి, కిశోర్, ఈశ్వర్ నాయక్, శివరామిరెడ్డి,నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ

దివంగత కాటసాని నాగార్జునరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బనగానపల్లె నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలు ఉత్సాహంగా సాగాయి. మహిళలు పెద్దఎత్తున పాల్గొనడంతో పాఠశాల మైదానం కిటకిటలాడింది. పోటాపోటీగా రకరకాల ముగ్గులు వేయడంతో విజేతలను ఎంపిక చేసేందుకు న్యాయనిర్ణేతలు ఇబ్బంది పడ్డారు. బనగానపల్లెకు చెందిన రేణుకకు డబుల్‌డోర్ రిఫ్రిజిరేటర్, కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లెకు చెందిన భారతికి సింగిల్ డోర్ రిఫ్రిజిరేటర్, పసుపల గ్రామానికి చెందిన ఇంద్రావతికి ఎల్ఈడీ టీవీ, పట్టణానికి చెందిన అంజనమ్మకు వాషింగ్‌మిషన్, నీరజకు రైస్ కుక్కర్‌ను కోడలు మేథాశ్రీరెడ్డితో కలిసి కాటసాని జయమ్మ అందజేశారు. అదేవిధంగా పోటీల్లో ప్రతి మహిళకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

గర్భిణులకూ అంబులెన్స్ ఏర్పాటు చేస్తాం

తమ కుమారుడు దివంగత కాటసాని నాగార్జున రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు ఇంకా విస్తృతం చేస్తామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమని కాటసాని విజయమ్మ తెలిపారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేసిన అనంతరం కాటసాని విజయమ్మ మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ ఏరియా కమ్యూనిటీ వైద్యశాలలో రోగుల సౌకర్యార్థం ఉచితంగా అంబులెన్స్ ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేసిన ఆమె క్రీడాకారులను అన్నివిధాలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు. గర్భిణుల సౌకర్యార్థం కూడా అంబులెన్సను ప్రభుత్వ వైద్యశాలలోనూ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరుతామన్నారు. కార్యక్రమంలో ముగ్గుల పోటీల నిర్వాహకులు డాక్టర్ ఎస్ వాసవీదేవి, సుప్రజ, స్వర్ణలత, డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ముగ్గుల పోటీలు

డోన్ టౌన్ : సంక్రాంతిని పురస్కరించుకుని ఆదివారం ముగ్గు ల పోటీలు నిర్వహిస్తున్న ట్లు ప్రజా నాట్యమండలి, ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ ఎఫ్ఐ నాయకులు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి పట్టణంలోని తారకరామనగర్‌లో ఉన్న ప్రగతిస్కూల్‌వద్ద, మధ్యాహ్నం 3 గంటల నుంచి కొట్లవారిపల్లె నుంచి కొత్త బుగ్గకు వెళ్లేదారిలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందిస్తామన్నారు.